ఎస్బీఐ చైర్మన్‌గా తెలంగాణ బిడ్డ ఎంపిక హర్షణీయం

మాజీ ఎంపీ బోయినపల్లి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 27వ చైర్మన్‌గా జోగుళాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడుకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి నియామకవడంపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసులుశెట్టి మారుమూల గ్రామంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివి, ఎస్బీఐ చైర్మన్ స్థాయికి ఎదగడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఎస్బీఐ చైర్మన్‌గా తెలుగువాళ్లు తొలిసారిగా నియామకమవడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. శ్రీనివాసులు శెట్టిని తెలంగాణ ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క సన్మానించాలని కోరారు.

మంత్రి పొంగులేటి కారు టైర్ పంక్చర్

వైరారూరల్, ఆగస్టు 8: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణిస్తున్న కారు టైరు గురువారం పంక్చర్ అయింది. డ్రైవర్ అప్రమత్తమై పక్కకు నిలిపారు. గురువారం ఖమ్మంలోని తన నివాసం నుంచి మంత్రి పొంగులేటి ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి కాన్వాయ్‌తో బయలుదేరారు. వైరాలోని హైలెవల్ వంతెన దిగిన తర్వాత జాతీయ రహదారిపై మంత్రి ప్రయాణిస్తున్న ల్యాండ్ క్రూజర్ వెనుక టైర్ పంక్చరైంది. అప్రమత్తమైన డ్రైవర్ కారును వెంటనే పక్కకు నిలిపారు. ఆ తర్వాత పొంగులేటి స్పేర్ వెహికిల్‌లో ప్రగడవరం వెళ్లిపోయారు.

ఎదులపహాడ్ అడవుల్లో పులి కదలికలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): తాడోబా అభయారణ్యాల నుంచి 25 రోజుల క్రితం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతానికి వచ్చిన ఎస్-12 పులి జనావాసాలకు దగ్గరగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మూడున్నర ఏళ్ల వయసున్న మగపులి కదలికలు తాజాగా తిర్యాణి మండలం ఎదులపహాడ్ అడవుల సమీపంలో కనిపించాయి.

ట్రిపుల్ ఆర్‌కు భూములివ్వం

భూమికి భూమి ఇస్తేనే ఒప్పుకుంటం • తేల్చిచెప్పిన సంగారెడ్డి జిల్లా రైతులు • పెద్దపూర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా

సదాశివపేట, ఆగస్టు 8: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. భూములు కోల్పోతున్న తమకు భూమికి భూమి ఇవ్వాలని, లేకపోతే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్, సదాశివపేట మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో అధికారులు డిజిటల్ భూ సర్వే నిర్వహించారు. సర్వేకు ఎలాంటి అడ్డంకులు జరగకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డు వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి భూసర్వే చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నుంచి వస్తున్న భూములను కోల్పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని, భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అనంతరం పెద్దాపూర్ వద్ద జాతీయ రహదారి 65పై ధర్నా నిర్వహించారు.

సంగారెడ్డి జిల్లా పెద్దాపూర్ శివారులో ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

భూమిస్తే నేనెట్ల బతికేది?

నాకు అద్దెరక భూమి ఉన్నది. భూమి ఇస్తే నేనెట్ల బతుకుడు. రోడ్డుకు భూ మియ్యా. అందరిస్తే నేనిస్తా. భూమికి భూమి ఇవ్వాలి. లేదంటే బయట ఉన్న రేటు కట్టియ్యాలి. గట్లయితేనే ఇస్తా. లేదంటే ఇయ్యా.

- పార్వతమ్మ, గిర్మాపూర్

ఆస్తిపన్ను మోత మోగుడే!

I తరువాయి...

పెంచడమేనని సమాచారం. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా ఆస్తి పన్ను వసూళ్లు ఏడాదికి రూ.1900 కోట్ల వరకు ఉండగా... దానిని రూ.5వేల కోట్లకు చేర్చాలనేది ఈ జీఐఎస్ సర్వే ప్రధాన లక్ష్యం. వాస్తవానికి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ సర్వే ప్రతిపాదన ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కానీ పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని భావించిన కేసీఆర్ సర్వే ప్రతిపాదనను తిరస్కరించారు. అదే ప్రతిపాదన ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ మొగ్గ తొడిగింది. అణువణువూ అన్వేషించి... పన్నుల మోతను మోగించేందుకు సిద్ధమవుతున్నది.

ప్రస్తుతం స్వీయ మదింపుతోనే చెల్లింపులు

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 19 లక్షలకు పైగా ఉన్న ఆస్తుల నుంచి ఏటా రూ.1900 కోట్ల వరకు ఆస్తి పన్ను రూపంలో జీహెచ్ఎంసీ ఖజానాకు చేరుతున్నది. ఎన్నో ఏండ్ల కిందట నిర్ధారించిన ఆస్తి పన్నును ప్రామాణికంగా చేసుకొని యజమానులు చెల్లింపులు జరుపుతున్నారు. అనుమతులు లేని నిర్మాణదారులు రెట్టింపు స్థాయిలో ఆస్తి పన్ను కడుతున్నారు. వీరంతా స్వీయ మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్) విధానంలోనే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. వీరు తమ ఆస్తిని భారీగా కాకున్నా... కొంతమేర తక్కువగా అంచనా వేసి చెల్లింపులు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరిలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో జీఐఎస్ సర్వే ద్వారా ప్రతి ఆస్తిని అణువణువూ లెక్కించవచ్చని ఒక ప్రైవేటు ఏజెన్సీ ప్రతిపాదించినట్టు తెలిసింది. జీఐఎస్ సర్వేలో డ్రోన్ ద్వారా ప్రతి ఆస్తి కొలతపక్కాగా తేలుతుంది. గూగుల్ స్ట్రీట్ మ్యాప్ ద్వారా అది ఎన్ని అంతస్థుల భవనమో నిర్ధారణ అవుతుంది. ఇలా ప్రతి అంగుళం కూడా లెక్కించి... అది నివాస ప్రాంతమా? లేక వాణిజ్య ప్రాంతమా? అనే ప్రామాణికతతో ఆస్తి పన్నును సవరించనున్నారు. అంటే ప్రస్తుతం చెల్లిస్తున్న దానికంటే ఇకపై భారీ మొత్తమే చెల్లించాల్సి వస్తుంది. తద్వారా జీహెచ్ఎంసీకి కాసుల వర్షం కురుస్తుందనేది సదరు ఏజెన్సీ వాదన.

ఉన్నపళంగా ఆర్థిక భారం మోపొద్దనే...

జీఐఎస్ సర్వే ప్రతిపాదనను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రైవేటు ఏజెన్సీ తెరపైకి తెచ్చింది. దీని ద్వారా జీహెచ్ఎంసీ ఆదాయం భారీగా పెరుగుతున్నది వాస్తవమే. కానీ ఆ పెరుగుదల పేద, మధ్యతరగతి భారాన్ని మోపుతుంది. ప్రస్తుతం ఆస్తుల మదింపు అణువణువూ కొలతల ఆధారంగా జరగలేదు. కాస్త అటుఇటూ ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు జీఐఎస్ సర్వే చేపట్టడమంటే చెల్లింపుదారుల నుంచి ముక్కుపిండి వాస్తవ మొత్తాన్ని వసూలు చేస్తారు. ఇండ్లకు సంబంధించిన ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలే అధికంగా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలను మినహాయిస్తే కాలనీల్లో ఉండే చిన్న చిన్న వ్యాపారదారులు కూడా మధ్య తరగతి కుటుంబాల పరిధిలోకే వస్తారు. నిర్మాణాల వాస్తవ కొలతల ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజల నుంచి ముక్కుపిండి ఆస్తి పన్ను వసూలు చేయాల్సి రావడాన్ని కేసీఆర్ ప్రభుత్వం వ్యతిరేకించింది. వారి జేబుల నుంచి వచ్చే సొమ్ముతో జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యాన్ని కేసీఆర్ తిరస్కరించారు. దీంతో ఆ ప్రతిపాదన అప్పట్లో అటకెక్కింది.

ఇంటి డాక్యుమెంట్లు అడుగుతున్న సర్వే సిబ్బంది

మరోవైపు ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా జరుగుతున్న ఈ సర్వేలో.. యజమానుల నుంచి ఆధార్ కార్డు, ఇంటి డాక్యుమెంట్లు అన్నీ సేకరిస్తున్నారు. దీనిపై నగరవాసుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ దగ్గర యజమానులకు సంబంధించిన సమగ్ర వివరాలు కంప్యూటరీకరించి ఉన్నందున ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరమేముందని వారు ప్రశ్నిస్తున్నారు. అసలే సైబర్ క్రైం నిత్యం ఓ పెను సవాల్‌గా మారిన ఇలాంటి తరుణంలో ప్రజల వ్యక్తిగత డాటా బయటికి పోవడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రైవేటు ఏజెన్సీలకు వ్యక్తిగత వివరాలు వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జీఐఎస్ సర్వే దరిమిలా ప్రైవేటు ఏజెన్సీ డాక్యుమెంట్లను తీసుకోవడాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఐఎస్ సర్వే మళ్లీ తెరపైకి వచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సర్వే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఆదాయానికి అదనంగా మరో రూ.3వేల కోట్లు వస్తాయనే లక్ష్యంతో ఈ సర్వేకు అనుమతి ఇచ్చినట్టు తెలుస్తున్నది. కానీ పైకి అధికారులు మాత్రం... గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరిచేందుకు జీఐఎస్ సర్వే ఎంతగానో దోహద పడుతుందని చెప్తున్నారు. కానీ సర్వే అనంతరం యజమానులకు సాంకేతికంగా కొలతలు చూపి.. గతంలో తక్కువ పరిమాణం ప్రాతిపదికన తక్కువ మొత్తం చెల్లిస్తున్నారని, వాస్తవ కొలతల ఆధారంగా ఇంత మొత్తం నిర్ధారణ అయిందని నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. సాంకేతిక సర్వే అయినందున యజమానులకు దానిని తప్పుబట్టే అవకాశం కూడా ఉండదు.

మా ఇంటికీ చెత్త బండి రావట్లే

- చెత్త సేకరణ నిర్వహణ సరిగా లేదు
- మేమూ ఇబ్బందులు పడుతున్నాం
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటింటి చెత్త సేకరణ సరిగా లేదు. రోజూవారీగా చెత్తను సేకరించటం లేదు. మా ఇంటికి సైతం చెత్తబండి రావటం లేదు. మేము కూడా ఇబ్బందులు పడుతున్నాం' అంటూ గురువారం స్వయానా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంత అధ్వానంగా ఉన్నదో చెప్పడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఐఏఎస్‌లు, ప్రముఖులు ఉండే రాజధాని దుస్థితి ఇది. ఇక పల్లెల దుస్థితిని మాటల్లో వర్ణించలేం. బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి, పట్టణ ప్రగతిని అటకెక్కించిన కాంగ్రెస్ సర్కారు చర్యల ఫలితంగా ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపిస్తున్నది. పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో వాళ్లు విధులు నిర్వర్తించటం లేదు. ఈ సమస్యపై మాజీ మంత్రి హరీశ్‌రావు గొంతెత్తడంతో.. గురువారమే కార్మికులకు వేతనాలు విడుదల చేస్తున్నట్టు మంత్రి సీతక్క ప్రకటించారు. కానీ ఇప్పటికే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతోపాటు అంటువ్యాధులు తీవ్రంగా ప్రబలాయి. ఇటీవల రాష్ట్రంలో ఇద్దరు నిండు గర్భిణులు డెంగ్యూ సోకి కన్నుమూశారు. వర్షాలు భారీగా కురుస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ అధ్వానంగా మారింది.

స్వచ్ఛ ఆటోలపై చర్యలేవి?

పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించింది. అయినా అధికారుల్లో చలనం లేదు. రాజధానిలో సుమారు 5,250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4,886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7 వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కో ఆటోకు 500-600 ఇండ్లు కేటాయించి, చెత్త సేకరణ చేపట్టాలి. కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా లేదు. రోజుకు దాదాపు 1,000 స్వచ్ఛ ఆటోలు పనిచేయటం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్‌రోస్ గుర్తించారు. ఇటీవల కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరుపై సమీక్షించి స్వచ్ఛ ఆటోలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదు.

ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

34 మంది విద్యార్థులకు అస్వస్థత

అచ్చంపేటటౌన్, ఆగస్టు 8: విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం ఆక్స్‌ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి పాఠశాలను తనిఖీ చేయాలని డీడీఎంహెచ్‌వో తారాసింగ్‌ను ఆదేశించారు. ఆయన హాస్టల్ భోజనాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా వైద్యాధికారి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 820 మందికి 525 మంది అల్పాహారం తీసుకున్నారని, వారిలో 34 మంది అస్వస్థతకు గురికాగా.. అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు.

మార్లిన్ మన్రో విగ్రహం తరలింపు!

న్యూయార్క్: వివాదాస్పదంగా మారిన ప్రఖ్యాత హాలీవుడ్ నటి, మోడల్, గాయని మార్లిన్ మన్రో భారీ విగ్రహాన్ని అమెరికాలోని పామ్ స్ప్రింగ్స్‌లో వేరే ప్రదేశానికి తరలించడానికి ఎట్టకేలకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 2014లోనే పామ్‌స్ప్రింగ్స్‌ను వదిలి తిరిగి 2021లో అదేచోటుకు చేరుకున్న ఈ భారీ విగ్రహంపై వివాదాలు చుట్టుముట్టాయి. 1955లో వచ్చిన 'ద సెవెన్ ఇయర్ ఇచ్' అనే చిత్రంలో మార్లిన్ మన్రో స్కర్ట్ సీన్ చలనచిత్ర రంగంలో ఒక ఐకానిక్ సీన్‌గా నిలిచిపోయింది. ఆ సీన్‌లోని స్టిల్‌తో మార్లిన్ మన్రో 26 అడుగుల విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే స్కర్ట్ ఎగిరే సెక్సీ దృశ్యంతో అంత భారీగా ఉన్న విగ్రహాన్ని చూసి మహిళలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పామ్ స్ప్రింగ్స్ మేయర్ జెఫ్రీ బెర్న్‌స్టీయిన్ తెలిపారు. అందుకే దానిని దగ్గరలోనే డౌన్‌టౌన్ పార్కులో ఒక నిర్దేశిత ప్రదేశానికి తరలించనున్నట్టు చెప్పారు.

బ్రిటన్‌లో జాతివివక్ష వ్యతిరేక నిరసనలు

లండన్ తదితర నగరాల్లో ప్రదర్శనలు

లండన్: జాతి వివక్ష వ్యతిరేక నిరసనకారులు బ్రిటన్‌లోని లండన్, తదితర నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. గత వారంలో రైట్‌వింగ్ గ్రూపులు వలసదారులకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలను తిప్పికొట్టేందుకు ఈ ప్రదర్శనలు జరిగాయి. వివిధ వర్గాలకు చెందినవారు ఐకమత్యాన్ని ప్రదర్శించారని నిర్వాహకులు తెలిపారు. నిరసనకారులు 'స్మాష్ ఫాసిజం అండ్ రేసిజం', 'స్టాప్ ది ఫార్ రైట్' అనే నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు. జాత్యహంకారం, ఇస్లామోఫోబియాలకు వ్యతిరేకంగా ఐకమత్యంగా నిలిచిన ప్రజలకు, లండన్‌వాసులకు రక్షణ కల్పించడంలో పగలు, రాత్రి శ్రమిస్తున్న పోలీసులకు ధన్యవాదాలు అని లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు.

లండన్‌లో..

యుద్ధ క్షేత్రంలోకి రోబో శునకాలు

'బ్యాడ్ వన్'ను సిద్ధం చేసిన ఉక్రెయిన్!

కీవ్: యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్న ఉక్రెయిన్ సరికొత్త ఆయుధాన్ని ఆవిష్కరించింది. సైన్యంలో తీవ్రమైన మానవ వనరుల కొరత ఎదుర్కొంటున్న ఆ దేశం, రోబో శునకం 'బ్యాడ్ వన్'ను అభివృద్ధి చేసింది. యుద్ధ క్షేత్రంలో, సైనిక ఆపరేషన్లలో వీటిని వాడాలని, రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇవి కీలకంగా మారుతాయని ఉక్రెయిన్ భావిస్తున్నది. త్వరలో వీటిని సైన్యంలో మోహరించబోతున్నట్టు వార్తలు వెలువడ్డాయి. సైనిక నిఘా, మందుపాతరలను గుర్తించేందుకు చేపట్టే హై-రిస్క్ ఆపరేషన్‌లలో 'బ్యాడ్ వన్'లను వాడబోతున్నట్టు తెలిసింది. ఏడు కిలోల మందుగుండు లేదా ఆయుధాల్ని, యుద్ధ క్షేత్రంలో గాయపడ్డ సైనికుడి వద్దకు ఔషధాల కిట్‌ను ఇవి మోసుకెళ్లగలవు.

కాఫీ, టీలో సుక్రలోజ్ వాడటం క్షేమమే!

న్యూఢిల్లీ: మధుమేహంతో బాధపడే వారు ఉదయం టీ లేదా కాఫీలో జీరో క్యాలరీ కృత్రిమ స్వీట్‌నర్ సుక్రలోజ్‌ను వాడటం వల్ల ప్రమాదం లేదని తాజా అధ్యయనం వెల్లడించింది. మూడు నెలల సగటు బ్లడ్ సుగర్ కౌంట్ (హెచ్‌బీఏ1సీ)ని ఇది పెంచబోదని తెలిపింది. అంతేకాకుండా, దీనిని కొద్ది మోతాదులో వాడితే, శరీరం బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందని వివరించింది. మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఈ పరిశోధనను నిర్వహించింది. టైప్-2 మధుమేహంతో బాధపడే వయోజనులకు ముప్పు కలిగించే అంశాలపై సుక్రలోజ్ ప్రభావం గురించి మన దేశంలో జరిగిన మొదటి అధ్యయనం ఇదే కావడం విశేషం. మన దేశంలో నేచర్, స్ప్లెండా, సుగర్-ఫ్రీ బ్రాండ్ల పేర్లతో ఈ ఆర్టిఫిషియల్ స్వీట్‌నర్ దొరుకుతుంది.

మధుమేహం కేసుల పెరుగుదలపై పిల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశంలో మధుమేహం, దాని అనుబంధ రోగాలు ఆందోళకర స్థాయిలో పెరగడంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) ఈ నెల 27న విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. తక్కువ పోషకాలు, పరిమితికి మించిన చక్కెర, ఉప్పు, నూనె ఉన్న ప్యాకేజ్డ్ ఆహారంపై వాటి వివరాలతో కూడిన ముందు వైపు లేబిలింగ్(ఎఫ్ఓపీఎల్) నిబంధన అమలు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని ఈ పిల్ దాఖలైంది. దీని వల్ల ప్రజలు సులువుగా పోషక విలువలు, హానికర పదార్థాల సమాచారాన్ని తెలుసుకుంటారని పిటిషనర్ తెలిపారు. మధుమేహం చాప కింద నీరులా దేశంలో వ్యాపిస్తున్నదని, లక్షలాది మందిపై ప్రభావం చూపుతున్న ఈ వ్యాధి మన ఆరోగ్య వ్యవస్థపై పెను భారాన్ని మోపుతున్నదని పిల్ వేసిన 3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ ఎన్జీవో తెలిపింది. దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు మధుమేహంతో బాధ పడుతున్నారని.. ఇది స్థూలకాయానికి దారి తీస్తుందని వెల్లడించింది.

నీట్ పీజీ వాయిదాపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. తాము వెళ్లడానికి తీవ్ర అసౌకర్యంగా ఉండే నగరాల్లో తమకు పరీక్ష కేంద్రాలను కేటాయించారని పిటిషనర్ ఆరోపించారు. విశాల్ సొరేన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

టోక్యో: భారీ భూకంపం ఒకటి గురువారం జపాన్‌ను వణికించింది. దక్షిణ తీర ప్రాంతంలోని క్యుషు తీరంలో సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. భూమికి 30 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపంతో అప్రమత్తమైన అధికారులు సునామీ హెచ్చరికలు జారీచేశారు. భూ ప్రకంపనలతో క్యుషు ద్వీపంలోని నిచినాన్ నగరం, మియాజకి ప్రాంతాలు చిగురుటాకులా వణికాయి. దీని ప్రభావంతో తీరంలో అలలు 1.6 అడుగుల మేర ఎగసిపడ్డాయి. అయితే ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు.

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

కటిహార్, ఆగస్టు 8: బీహార్‌లో మరో బ్రిడ్జి కూలింది. కటిహార్ జిల్లాలోని గంగానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జిలో కొంత భాగం గురువారం కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. బకియా సుఖాయె పంచాయతీని జిల్లా కేంద్రానికి కలుపుతూ నిర్మిస్తున్న ఈ చిన్న బ్రిడ్జిని రూరల్ వర్క్స్ శాఖ నిర్మిస్తున్నది. నదీ ప్రవాహ ఒత్తడి వల్లే నిర్మాణంలో ఉన్న పిల్లర్లు కూలాయని అధికారులు తెలిపారు.

ప్రముఖ సినీ నటుడు చిరంజీవి గురువారం కేరళ సీఎం విజయన్‌ను కలిశారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థం రూ.1 కోటి చెక్కును అందజేశారు.

బీహార్‌లో గుళ్లు, మఠాల నమోదు తప్పనిసరి

పాట్నా: ఆలయాలు, మఠాలు, ట్రస్టుల రిజిస్ట్రేషన్‌ను బీహార్ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో నమోదు కాని ఆలయాలను నమోదయ్యేలా చూడాలని ప్రభుత్వం అన్ని జిల్లాల మెజిస్ట్రేట్‌లకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే వాటి స్థిరాస్తుల వివరాలను బీహార్ రాష్ట్ర మత పరమైన ట్రస్టుల బోర్డు(బీఎస్‌బీఆర్‌టీ) వెబ్‌సైట్‌లో ఉంచాలని తెలిపింది. బీహార్ హిందూ మత ట్రస్ట్‌ల చట్టం-1950 ప్రకారం అన్ని దేవాలయాలు, మఠాలు, ట్రస్ట్‌లు, ధర్మశాలలు బీఎస్‌బీఆర్‌టీలో వివరాలు నమోదు చేసుకోవాలని మంత్రి నితిన్ నబిన్ గురువారం తెలిపారు. రిజిస్టర్ అయిన దేవాలయాలు, మఠాలు, ట్రస్ట్‌లకు సంబంధించిన చట్ట విరుద్ధ ఆస్తుల లావాదేవీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆ రాశి వారు వద్దు!

చైనా కంపెనీ ఉద్యోగ ప్రకటన

బీజింగ్: చైనాలో ఓ కంపెనీ విడుదల చేసిన ఉద్యోగ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఫలానా రాశిలో (ఇయర్ ఆఫ్ ద డాగ్) పుట్టిన దరఖాస్తుదారులను తీసుకోబోమని ఆ దేశంలోని ఓ రవాణా కంపెనీ ఉద్యోగ ప్రకటన జారీచేసింది. తక్కువ అర్హతలున్నా.. వేరే రాశిలో జన్మించిన వారి దరఖాస్తులను తీసుకుంటామని తెలిపింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం, గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని సాంక్సింగ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ క్లర్క్ ఉద్యోగాల కోసం పత్రికల్లో ప్రకటన విడుదల చేసింది. 'ఇయర్ ఆఫ్ ద డాగ్'లో పుట్టిన దరఖాస్తుదారులను బ్యాన్ చేసినట్టు తెలిపింది. దీనిపై కంపెనీ ఉద్యోగి మాట్లాడుతూ, 'కంపెనీ బాస్ రాశి 'డ్రాగన్'. దీనికి 'ఇయర్ ఆఫ్ ద డాగ్'కు పొంతన కుదరదు. కంపెనీకి నష్టం వాటిల్లుతుందని భావించాం' అని చెప్పారు.

సీబీఐకి చిక్కిన ఈడీ

- లంచం కేసులో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ అరెస్టు
- 20 లక్షలు తీసుకొంటూ అడ్డంగా బుక్కైన వైనం
- బాధితుడి ఫిర్యాదుతో ప్లాన్ వేసి పట్టుకొన్న సీబీఐ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులంటే ఆర్థిక నేరగాళ్లకు వణుకు. సోదాలకు వాళ్లు వస్తున్నారంటేనే భయపడిపోతారు. అలాంటి ఈడీలో అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి ఒకరు లంచానికి తెగబడ్డాడు. అడిగినంత సొమ్ము ఇవ్వకపోతే అక్రమ కేసు బనాయిస్తానని ఓ వ్యాపారిని బెదిరించాడు. దీంతో ఏం చేయాలో తెలియని బాధితుడు తనను రక్షించాలంటూ ఈడీకి జంట ఏజెన్సీగా చెప్పుకొనే సీబీఐని ఆశ్రయించాడు. ఇంకేముంది.. నిందితుడైన ఆ ఈడీ అధికారిని చాకచక్యంగా ప్లాన్ వేసి సీబీఐ అధికారులు పట్టుకొన్నారు.

అసలేం జరిగిందంటే?

ముంబైకి చెందిన ఓ వ్యక్తి నగల వ్యాపారం చేస్తాడు. సదరు వ్యాపారి అక్రమార్జనకు పాల్పడినట్టు ఎవరో చేసిన ఫిర్యాదుతో గత శనివారం, ఆదివారం ఆయన ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ సింగ్ యాదవ్ నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. అయితే, ఆ సోదాల్లో ఏమీ లభించకపోవడంతో.. తన బుద్ధిచూపించిన యాదవ్.. తనకు రూ. 25 లక్షలు ఇవ్వాలని వ్యాపారిని డిమాండ్ చేశాడు. లేకుంటే నీ కొడుకుపై అక్రమ కేసు బనాయిస్తానని బెదిరించాడు. బేరాలు పూర్తయ్యాక లంచం రూ. 20 లక్షలకు కుదిరింది. అయితే, ఈడీ అధికారిని